తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

# పక్కా వైద్య సేవలతో మాతృ మరణాలు కట్టడి

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి**



చిత్తూరు, ఆగస్టు 31 ప్రభాతవార్త: గర్భిణీలు, బాలింతలకు పక్కా వైద్యం అందించి మాతృమరణాలు కట్టడి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. డిఎంహెచ్‌ఓ కార్యాలయం నుండి సోమవారం డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి పిహెచ్‌సి వైద్యాధికారులతో జూన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డిఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో అమలు అవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నాణ్యతతో, లక్ష్యాలకు అనుగుణంగా అమలు చేయాలని, సంజీవని, కేసిడీ ప్రాజెక్టుల్లో పురోగతిని వేగవంతం చేసి సెప్టెంబర్ మొదటి వారం నాటికి 2 లక్షలకు పైగా లక్ష్యంను సాధించాలన్నారు. అలాగే ఆర్‌బిఎస్‌కె స్క్రీనింగ్‌ను ప్రతి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో నాణ్యతతో నిర్వహించి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, పిహెచ్‌సిల్లో ప్రజలకు అందించే అన్ని రకాల వైద్య సేవలను కచ్చితత్వంతో, నాణ్యతతో అందించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో అక్కడక్కడ డెంగ్యూ, హెచ్1ఎన్1 కేసులు నమోదు అవుతున్నాయని వైద్య సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. హెచ్1ఎన్1 వ్యాధికి సంబంధించి తిరుపతి రూయా ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్నటఉ్ల , లక్షణాలు వున్న వారిని సత్వరం గుర్తించి అవసరమైతే రెఫర్ చేసి తగిన చికిత్సీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో జులై, ఆగస్టు నెలల్లో మాతృమరణాలు లేకపోవడం అభినందనీయమని, అదే స్ఫూర్తితో ప్రతి గర్భిణీకి అవసరమైన అన్ని రకాల వైద్య సేవలను సకాలంలో అందించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, డాక్టర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# కూటమిని...దెబ్బతీసే

**-జనసేనాని మాటలు బేఖాతర్! -తిరుపతిలో వీర బలిజ సాంస్కృతిక పునర్జీవన శంఖారావ సభతో దుమారం**



ప్రభాతవార్త-తిరుపతి:
రాష్ట్రంలో అనూహ్యంగా 2024 ఎన్నికలకు ముందే టిడిపితో కలసి బిజెపి, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పాటై తదనంతరం ప్రభుత్వం ఏర్పాటుచేశాయి. ఈ మూడుపార్టీల అధినేతలు ప్రజలకోసం,వారికి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనితీరు ఉంటుందని ప్రకటించారు. ఇదే ధోరణితోనే ఇప్పటికీ మూడు పార్టీల అధినేతలు ఐక్యంగా ప్రభుత్వంలో ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నాయి. ఇటీవల తరచూ టిడిపి అధినేత ,సిఎం చంద్రబాబు నాయుడు, జనసేనాని, డిసిఎం పవన్‌కళ్యాణ్ తమ పార్టీ నేతలు,క్యాడర్‌కు స్పష్టమైన సంకేతాలు కూడా ఇచ్చారు. కూటమిలో ఏ పార్టీని విమర్శించరాదని, వ్యక్తిగత ఆరోపణలు దూషణలకు దూరంగా ఉండాలని సంకేతాలిచ్చారు. అయితే అందుకు భిన్నంగా ఆదివారం తిరుపతిలో జరిగిన వీర బలిజ సాంస్కృతిక పునర్జీవన శంఖారావ సభలో నేతలు పవన్‌కళ్యాణ్ హితోక్తులకు తిలోదకాలిచ్చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏకంగా ఈ సభలో 2029లో పవన్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించాలన్న బలిజ శంఖారావం తీర్మానం కూడా చేయడం సంచలనంగా మారింది. రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. 2029 ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై ఇప్పటి నుండే తిరుపతి సభతో రచ్చ ఆరంభమైందనేది తెలుస్తోంది. వీర బలిజ సాంస్కృతిక పునర్జీవన శంఖారావ సభలో ఏకంగా 2029 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ప్రకటించా లంటూ తీర్మానం చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రిగా పవన్ కళ్యాణ్ కొన సాగుతున్నారు. కూటమి మరి కొంతకాలం ఐక్యంగా కొన సాగాలని పవన్ కళ్యాణ్ పలుమార్లు ఆకాంక్ష వ్యక్తం చేసిన నేపథ్యంలో 2029 ఎన్నికలకు సంబంధించి ఇప్పుడే సిఎం అభ్యర్థిత్వాన్ని తెరపైకి తీసుకురావడం కూటమి రాజకీయాలపై ప్రభావం చూపు తుందనే చర్చ రాజకీయవర్గాల్లో మొదలైంది. తిరుపతిలో జరిగిన శంఖారావసభలో మొత్తం ఏడు తీర్మా నాలను ఆమోదించారు. రాయలసీమలో బలిజలు గణనీయ సంఖ్యలో ఉన్నందున 54 అసెంబ్లీ స్థానాల్లో కనీసం 15 స్థానాలను బలిజ అభ్యర్థులకు ప్రధాన రాజకీయ పార్టీలు కేటాయించాలని సభ డిమాండ్ చేసింది. కాపుల మద్దతుతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని పేర్కొంటూ 2029లో టిడిపి కూడా కాపు సామాజిక వర్గానికి చెందిన నేతను సిఎం అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేయడం ఇప్పుడు రాజకీ యంగా వేడి పుట్టిస్తోంది. పవన్ కళ్యాణ్‌ను 2029సిఎం అభ్యర్థిగా ప్రకటించాలన్న డిమాండ్ కూటమిలో కొత్త చర్చకు తెర తీస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. 2029 నాయకత్వంపై ముందుగానే చర్చ మొద లైతే కూటమి పార్టీల మధ్య సమన్వయంపై ప్రభావం పడే అవకాశం ఉం దని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో బలిజ ఓటర్లను ఆకర్షిం చేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు భవిష్యత్‌లో ఎలాంటి వ్యూహాలను అనుసరి స్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అయితే, ఒక సామాజిక వర్గానికి చెందిన సభలో చేసిన తీర్మానాలను ఆయా రాజకీయ పార్టీల అధికారిక నిర్ణయాలుగా పరిగణించలేరని, 2029 నాటికి రాష్ట్ర రాజకీయ సమీకరణాలు ఎలా మారుతాయన్నదే అసలు ప్రశ్న. ఇప్పటికీ మరో పార్టీ ట్రాప్‌లో పడి కూటమిని దెబ్బతీసే ప్రయత్నంగా అభివర్ణిస్తున్నారు. ఇది కూటమి ఐక్యతను దెబ్బతీసేందుకు ఎవరో చేస్తున్న రాజకీయ ప్రయత్నమా? బలిజ సామాజిక వర్గం తమ రాజకీయ ప్రాతినిధ్యం కోసం చేస్తున్న సహజమైన డిమాండా? అన్నది ఇప్పుడు రాజకీయ చర్చగా మారింది.

## డ్రగ్ ఫ్రీ జిల్లా ఆవిర్భావం కోసం...

# సమన్వయంతో విధులు

**- రవాణా మార్గాల్లో విస్తృతంగా తనిఖీలు, నిఘా పెంపుకు చర్యలు**
**- కలెక్టర్ సుమిత్‌కుమార్**



చిత్తూరు, ఆగస్టు 31 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దడానికి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, దేశ భవిష్యత్తుకు అవసరమైన యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుండి సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎన్సి ఓఆర్డీ(నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్) జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ కాన్ఫరెన్స్‌కు చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి ఆర్డీఓలు, పోలీసు అధికారులు, ఎక్సైజ్ సూపరిటెండెంట్, ఈగల్ టీమ్ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంను కట్టడి చేయడానికి అన్ని శాఖలు మరింత సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాల మధ్య డ్రగ్స్ రవాణాకు రైల్వే, ఆర్టీసీ ప్రధాన మార్గాలుగా వుండటంతో ఈ మార్గాల్లో తనిఖీలు, నిఘాను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు తమ పరిధిలో డ్రగ్స్ అక్రమ రవాణాను కట్టడి చేయడానికి తీసుకుంటున్న చర్యలు, రాండమ్ చెకింగ్ విధానం, డ్రైవర్లు, కండెక్టర్లకు ఇస్తున్న శిక్షణ, పోలీసుల సహకారంతో నిర్వహిస్తున్న తనిఖీలు తదితర అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దీనికి సంబంధించి అన్ని డిపోల మేనేజర్లు, డీఎం, ఆర్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి నుండి లిఖితపూర్వక నివేదికలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంకు పాల్పడే వారిపై ముందస్తు నిఘా పెంచాలని, అవసరమైన సందర్భాల్లో సంబంధిత వ్యక్తులకు అవగాహన కల్పించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఎక్సైజ్ శాఖ, ఆర్డీఓలు, డీఎస్పీలు, పోలీసు శాఖ, ఈగల్ సెల్ అధికారులు తమ పరిధిలో చేపడుతున్న చర్యలపై లిఖిత పూర్వక నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే యువతను మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులు కాకుండా చేయడానికి పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, మెడికల్ కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించి సమాచారం తెలిసినట్లైతే పోలీసు శాఖ లేదా ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972, 94906 17896 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

## జేయన్‌టియు స్కిట్‌లో చేరడానికి...

# సుముఖత చూపని విద్యార్థులు

**-కేవలం 20 మంది మాత్రమే జాయినింగ్ రిపోర్టు**
**-ఈ ఏడాది కూడా భవిష్యత్తు ప్రశ్నార్థకమే!**



శ్రీకాళహస్తీశ్వరాలయ స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల దృశ్యం

శ్రీకాళహస్తి,ఆగస్టు 31 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో నిర్వహించిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పునఃప్రారంభించటానికి అనంత జేయన్‌టియు శతవిధాల ప్రయత్నించారు. అయితే పుణ్యకాలం కాస్త దాటిపోయిన తరువాత యుద్ధ ప్రాతిపదిక అంటూ పరుగులు తీసారు. కానీ విద్యార్థుల్లో నమ్మకం కల్పించలేకపోయారు. దాంతో దరఖాస్తు చేసిన విద్యార్థులు చేరటానికి సుముఖత చూపలేదు. చివరకు సోమవారం సాయంత్రం అందిన సమాచారం మేరకు కేవలం 20 మంది మాత్రమే చేరటానికి సుముఖత చూపారు. దాంతో ఈ ఏడాది కూడా ఇక్కడ అనంత జేయన్‌టియు స్కిట్ నిర్వహణ లేనట్లే!.

**విద్యార్థుల ఆశలు అడియాశలే...**

సుమారు ఏడేళ్ళ తరువాత మళ్ళీ శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా సుమారు 20 సంవత్సరాల పాటు నిర్వహించిన సరస్వతి నిలయం 7 సంవత్స రాలుగా మూత బడి మళ్ళీ ఈ ఏడాది తరగతులు నిర్వహణకు సన్నాహాలు చేపట్టారు. సాంకేతిక పరమైన అంశాలపై నిర్ణయం ఆలస్యం జరిగింది. అగ్రిమెంట్ విషయంలో చోటు చేసుకున్న సందిగ్ధతతో ఈ ఏడాది కకూడా ఇక్కడ తరగతులు నిర్వహణ కష్టంగానే మారింది. గత ఏడాది కౌన్సెలింగ్‌లో స్కిట్‌కు అవకాశం కల్పించినా కొన్ని అనివార్యకారణాలతో ఇక్కడ చేరిన విద్యార్థులు కలికిరిలోని అనంతపురం జేయన్‌టియులో చదవాల్సి వచ్చింది.అయితే బాలారిష్టాలు తొలగించుకొని ఈ ఏడాది శ్రీకాళహస్తిలోని మొదటి సంవత్సరం తరగతుల నిర్వహణకు సన్నాహాలు చేసారు.ఈ నేపథ్యంలో ఇక్కడ దీర్ఘకాలంగా మూతపడ్డ కళాశాలను పునఃప్రారంభానికి సంబంధించిన భవనాల మరమ్మత్తులకు రూ.9కోట్లు కేటాయించి పనులు ఓ సంస్థకు అప్పగించినప్పటికి ప్రయోజనం చేకూరలేదు.

**కౌన్సెలింగ్‌లో విశేష స్పందన:**

శ్రీకాళహస్తిలోని అనంత జేయన్‌టియు కళాశాలలో ఈ ఏడాది ప్రవేశాలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది, కానీ సకాలంలో ప్రైవేటు కళాశాలలతో పోటీ పడలేకపోయారు. కళాశాలకు ప్రభుత్వం 330 సీట్లను కేటాయించగా 227 మంది విద్యార్థులు దరఖాస్తు చేసున్నారు. సియస్‌సి డేటాలో 66 సీట్లు ఉండగా 28మంది, ట్రిబుల్ ఇలో 66 సీట్లుకు కేవలం 9 మంది దరఖాస్తు చేసుకున్నారు.కానీ కౌన్సెలింగ్ రెండవ దశలో విద్యార్థులు చేజారి పోయారు. చివరకు 20మంది మాత్రమే మిగిలారు. వీరితో కళాశాలను ఎలా నిర్వహిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

**విద్యార్థుల్లో నమ్మకం కల్గించలేకపోయారు:**

శ్రీకాళహస్తిలోని ఇంజనీరింగ్ కళాశాలను వైకాపా హయాంలో మూసివేసారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత శాసనసభ్యుడు సుదీర్‌రెడ్డి పట్టుబట్టి విద్యాశాఖ మంత్రి వెంటబడి అన్ని అనుమతులు,ఆర్థిక చేయూత కల్పించినప్పటికి 'అగ్రిమెంట్' విషయంలో తీవ్ర జాప్యం జరిగింది. దాంతో అనంత జేయన్‌టియు సకాలంలో నిర్ణయం తీసుకోలేక పోయారు. అనుమతి లభించినా కౌన్సెలింగ్‌లో వెనుకబడ్డారు. విద్యార్థుల్లో నమ్మకం కల్పించటంలో విజయం సాధించలేక పోయారు. ఈ ఏడాది ఇక్కడ తరగతులు నిర్వహిస్తామనే నమ్మకంను కల్పించలేక పోవటంతో చివరి దశలో విద్యార్థులు ఇతర కళాశాలలకు వెళ్ళాల్సి వచ్చింది. అనుమతులు సాధించటంలో పరుగులు తీసిన శాసనసభ్యుని ప్రయత్నాలు ఈ ఏడాది కూడా సఫలీకృతుల్ని చేయలేక పోయాయి. మరి పూర్తి స్థాయి సదుపాయాలతో వచ్చే ఏడాది అయినా ప్రారంభిస్తారో లేదో వేచి చూడాలి. మరి చేరిన 20 మంది విద్యార్థులకు ఇతర కళాశాలల్లో కకూడా అవకాశం లేదు. కాబట్టి వారిని ఏం చేస్తారు? గతేడాదిలాగే ఈ ఏడాది కూడా అనంతజేయన్‌టియు కళాశాలలకు వలస పంపుతారా? అనేది వేచి చూడాలి.

## అత్యవసర వైద్య సేవల...

# బలోపేతానికి ప్రత్యేక చర్యలు

**-వైస్ ఛాన్సలర్ డా. గుడారు జగదీష్ ఆకస్మిక తనిఖీలు**



స్విమ్స్ అత్యవసర వైద్య విభాగాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సంచాలకులు

తిరుపతి హెల్త్, ఆగస్టు 31 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో అత్యవసర వైద్య సేవలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా, రోగి కేంద్రితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్ అధికారులను ఆదేశించారు. ఈ దిశగా సోమవారం తెల్లవారు జామున 6గంటలకే స్వయంగా ఆసుపత్రిని సందర్శించిన డా. గుడారు జగదీష్, రెస్పిరేటరీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, క్యాజువాలిటీ, ఎక్స్‌టెన్షన్ క్యాజువాలిటీ తదితర అత్యవసర వైద్య విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అత్యవసర విభాగాల పనితీరు, వైద్యులు, సిబ్బంది అందుబాటు, రోగులకు అందుతున్న చికిత్స, మౌలిక సదుపాయాలు, అత్యవసర వైద్య పరికరాల సంసిద్ధత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగుల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతనిఖీల సందర్భంగా చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లిన డా. గుడారు జగదీష్ వారి ఆరోగ్య పరిస్థితి, ఆసుపత్రికి వచ్చిన సమయం, వైద్య పరీక్షలు, చికిత్స ప్రారంభమైన తీరు తదితర వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న సేవలపై వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడి కేసుల వారీగా పరిస్థితిని సమీక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో ఒక్క క్షణం కూడా వృథా కాకూడదని ఆయన స్పష్టం చేశారు. స్విమ్స్ వంటి అత్యున్నత వైద్య సంస్థకు తిరుపతితో పాటు రాయలసీమ జిల్లాలు మరియు ఇతర ప్రాంతాల నుంచి కూడా క్లిష్టమైన, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రోగులు వస్తుంటారని, అందువల్ల ఎమర్జెన్సీ విభాగం 24/7 పూర్తి స్థాయి సంసిద్ధతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమర్జెన్సీ విభాగానికి వచ్చే రోగుల తీవ్రతను బట్టి ప్రాధాన్యతను నిర్ణయించి, అత్యంత ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు అత్యధిక ప్రాధాన్యతతో తక్షణ చికిత్స అందించాలని సూచించారు.కార్డియాక్ ఎమర్జెన్సీలు, స్ట్రోక్, శ్వాసకోశ అత్యవసర పరిస్థితులు, తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, పాలీట్రామా, విషప్రయోగాలు, ఇతర ప్రాణాపాయ పరిస్థితుల్లో సంబంధిత సూపర్ స్పెషాలిటీ విభాగాల మధ్య వేగవంతమైన సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. క్యాజువాలిటీ, ఇంటెన్సివ్ కేర్ విభాగాల్లో అవసరమైన వెంటిలేటర్లు, మానిటర్లు, డిఫిబ్రిలేటర్లు, ఆక్సిజన్ సదుపాయం, సక్షన్ యూనిట్లు, అత్యవసర మందులు, ఇతర ప్రాణరక్షణ పరికరాలు నిరంతరం పనిచేసే స్థితిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.పరికరాలు క్యాజువాలిటీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, అనస్థీషియా, క్రిటికల్ కేర్, రేడియాలజీ, ల్యాబొరేటరీ, బ్లడ్ బ్యాంక్ తదితర విభాగాలు ఒకే బృందంగా సమన్వయంతో పనిచేసినప్పుడే అత్యవసర రోగికి అత్యుత్తమ ఫలితం సాధ్యమవుతుందని తెలిపారు. అత్యవసర విభాగాల వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, ఇతర సిబ్బంది పూర్తి సమన్వయంతో పనిచేసి, ఆసుపత్రికి వచ్చే ప్రతి అత్యవసర రోగికి సకాలంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని డా. గుడారు జగదీష్ ఆదేశించారు.

# గజ దాడులతో... రైతులు గగ్గోలు

చిన్నగొట్టిగల్లు, ఆగస్టు 31 ప్రభాతవార్త: చిన్నగొట్టిగల్లు మండలం పరిసర




పంట పొల్లాలపై గజరాజుల దాడులు

ప్రాంతాల్లో రైతుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది. ఏనుగుల దాడులు విపరీతంగా పెరగడంతో పంట పొలాలు నాశనం అవుతుండగా, ప్రభుత్వం- అటవీశాఖ నిరక్ష్య్ల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు కోల్పోయిన రైతులు ఆర్థికంగా కుంగిపోతూ, భయాందోళనలో రోజులు గడుపుతున్నారు. గుంపులుగా దూసుకొస్తున్న ఏనుగులు వరి,టమోటా వంటి పంటలను పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయి. రాత్రి వేళల్లో ఏనుగుల సంచారం మరింత పెరగడంతో గ్రామస్తులు బయటకు రావడానికి కూడా భయపడుతున్నారు. ఆదివారం రాత్రి నెల్లూట్లవారిపల్లి పంచాయతీలో వరి పైరు, ఎగవురు పంచాయతీలో పంచాయతీ బోరుని విరిచేసాయని రైతులు వాపోయారు ఊర్లలోకి ఏనుగులు వస్తుండడం తో ప్రాణాలకు కూడా ముప్పు పొంచి ఉండటంతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతు న్నామన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఎప్పుడైనా ఏనుగులు దాడి చేస్తాయన్న భయంతో రైతులు పొలాలకు వెళ్లడానికే వెనుకాడుతున్నారు.

# పవిత్రతకు తూట్లు!

**-యాత్రికులకు రోతపుట్టిస్తున్న రకరకాల ప్లెక్సీలు ,బ్యానర్లు**
**-నిద్రావస్థలో మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్**



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుపతి:**
తిరుపతి నగర పవిత్రత మసకబారుతున్నా...యాత్రాస్థలం విశిష్టతకు ఇబ్బంది కలిగిస్తున్న రకరకాల ప్లెక్సీలు, బ్యానర్లు యాత్రికులకు రోత పుట్టిస్తున్నాయి. నగరంలో భక్తిభావంతో...మంచి మనస్సుతో కాలుపెట్టిన బయటి వ్యక్తులకేగాక నగరప్రజలకు కూడా పలురకాల ప్లెక్సీలు మనోవేదనకు గురిచేస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఏదేని శుభకార్యాలు, మృతి చెందిన వ్యక్తులకు సంబంధించిన ప్లెక్సీలు జనానికి వికారం కలిగిస్తున్నాయి. ఇవేమీ మున్సిపల్ కార్పొరేషన్ సంబంధిత టౌన్‌ప్లానింగ్ విభాగానికిగానీ, ఆరోగ్యవిభాగం కళ్లకు కనబడక పోవడం, పట్టడంలేదంటే ఎంత వికారంగా తయారైందో వేరే చెప్పవలసిన అవసరం లేదు. నగరంలో ప్రధాన కూడళ్ళయిన పూర్ణకుంభం,రామానుజుల, అన్నమయ్య, కెటిరోడ్డులో నంది సర్కిల్, టౌన్‌క్లబ్ ఎన్టీఆర్ సర్కిల్, బాలాజీకాలనీ, అలిపిరి గరుడవిగ్రహం సర్కిల్‌ల్లోనేగాక తిరుమల నుండి దిగే కూడలిలో, ఆలయాల పరిసరాల్లోనూ మరీ ముఖ్యంగా నగరంలో ఆర్టీసి బస్టాండ్, రైల్వేస్టేషన్,టిటిడి శ్రీనివాసం, విష్ణునివాసం ప్రాంతాల్లో, పెద్దకాపు లేఔట్, గంగమ్మగుడి,పాత మున్సిపల్ కార్యాలయం, తుడ కార్యాలయం ప్రాంతాల్లో రోడ్లపై విద్యుత్ స్తంభాలకు, డివైడర్లపై ప్లెక్సీలు, బ్యానర్లు కట్టి జనానికి రోతపుట్టిస్తున్నారంటే మున్సిపల్ అధికారుల ప్రేక్షకపాత్ర అర్థమవుతుంది. ఏదేని రాజకీయ నేతల ప్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటుచేసిన 24గంటల్లోపే తొలగించాల్సి ఉంది. అయితే దీనిపై మున్సిపాల్టీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం మరీ విశేషం. తిరుపతి నగర పవిత్రతను దెబ్బతీస్తున్న ప్లెక్సీలు, బ్యానర్లు తొలగించడానికి టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది 24గంటలూ పనిచేయాల్సిన అవసరం ఉంది. అయితే ఇవీ ఏర్పాటుకు ఎంతవరకు అనుమతులిస్తున్నారనేది కూడా ఆ విభాగాలకు తెలియకపోవడం మరీ శోచనీయం. రకరకాల ప్లెక్సీలు, బ్యానర్లతో ఆధ్యాత్మికనగరం తిరుపతి రోడ్లు వికారం పుట్టిస్తున్నాయని యాత్రికులు, భక్తులు వాపోతున్నారు. మరీ తిరుమలకు వెళ్లే మార్గాల్లోనూ తిరుపతి నగరంలోని రోడ్లన్నీ రాజకీయ నేతలకు పుట్టినరోజు శుభాకాంక్షలు, వివిధ కార్యక్రమాల కోసం ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీ బోర్డులతో నిండిపోతున్నాయి.

రోడ్డు పక్కన ఉండే స్తంభాలు, డివైడర్ల నుండి ఫుట్‌పాత్‌లు, కూడళ్ల వరకు దాదాపు ప్రతి ఖాళీ స్థలం ప్రచారానికే వినియోగించ బడుతోంది. రాజకీయ నాయకులు, వారి అనుచరులు పుట్టినరోజులు, ఇతర సందర్భాలను పురస్కరిం చుకుని ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు.వీరేగాక వాణిజ్య, ప్రైవేట్ ప్రకటనలు కూడా మరింత ఎక్కువయ్యాయి. ఆలయాలకు వెళ్లే రహదారులపై ఈ దుస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. ప్రతిరోజూ వేలాది మంది యాత్రికులు ఈ మార్గాల్లో ప్రయాణిస్తుండగా, నగర వీధులు, రహదారులు ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా, శుభ్రంగా ఉండాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నగరంలో ప్రతి ప్రధాన రహదారి, కూడలిలోనూ బ్యానర్లు, ప్రకటనలు సర్వసాధారణమైపోయాయి. తరచుగా రాత్రికి రాత్రే ఏర్పాటు చేసే ఈ బ్యానర్లు, ఆయా కార్యక్రమాలు ముగిసిన తర్వాత కూడా రోజుల తరబడి అక్కడే ఉండిపోతున్నాయి. ఈ విషయంపై తిరుపతి నూతన కమిషనర్ టౌన్‌ప్లానింగ్, ఆరోగ్యశాఖ అధికారులకు ఇకనైనా ఆదేశాలిచ్చి కంపుపుట్టిస్తున్న ప్లెక్సీలు, బ్యానర్లను తొలగించడంలో చొరవచూపుతారని నగరప్రజలు ఆశిస్తున్నారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలి వరుణజపం పర్జన్యశాంతి హోమాలు



తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రం లో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ క్షేమంగా ఉండాలని కోరుతూ ధర్మగిరి వేదపాఠశాలలో కారీరిష్టి యాగం,వరుణజపం, పర్జన్యశాంతి హోమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వర్షాలు సమృద్ధిగా కురవాలని ఏడుకొండల వేంకటేశ్వరుని ప్రార్థిస్తూ 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో యాగాలు, జపాలు, పారాయణాలు నిర్వహిస్తున్నారు. ఆరుగురు ఋత్వికులు కారీరిష్టి యాగం చేపడుతున్నారు. 12 మంది ఋత్వికులు గోగర్భం తీర్థంలో నడుము లోతు నీళ్లలో నిల్చుని వరుణ, పర్జన్య మంత్రాలను పఠించారు. అదేవిధంగా ఏడు వేద శాఖలకు చెందిన 14 మంది ఋత్వికులు రామాయణం, భాగవతం, మహాభారతంలోని విరాటపర్వం పారాయణం చేస్తున్నారు. అష్టదిక్పాలకులు, ఇంద్రాది సమస్త దేవతలను శాంతింపజేసి, కరుణించేలా కారీరిష్టి యాగాన్ని మొదలు పెట్టారు. సాధారణ హోమాలకు భిన్నంగా కారీరిష్టి యాగంలో రుత్వికులు నల్లని దుస్తులను ధరించారు. మేఘాలను ఆకర్షించి కుంభవృష్టి వర్షం కురిసేలా అనుగ్రహించాలని వేదమంత్రాలతో పూజలు చేస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## చివరి మజిలికి కూడా...కుటుంబాలకు కష్టాలు,కన్నీళ్ళు



శ్రీకాళహస్తి, ఆగస్టు 31 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి

హిందూ శ్మశాన వాటికలో బహిరంగ దోపిడీపై సామాన్య ప్రజలు గళం విప్పారు. చనిపోయిన తర్వాత కూడా పేదవాడి కుటుంబానికి ప్రశాంతత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తూ సోమవారం శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఎవరైనా చనిపోతే ఖననానికి కొందరు వ్యక్తులు శ్మశానాన్ని ఆక్రమించుకొని పిచ్చల విడిగా వ్యాపారం సాగిస్తున్నారని తమ ఆవేదనను వ్యక్తం చేసారు. బతికుండగా కనీసం వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో చనిపోతే కనీసం రూ.50వేలు కావాల్సి రావటం బాధాకరంగా మారిందని పలువురు కమిషనర్‌కు వివరించారు.ఈ అంశానికి సంబంధించి గతంలో స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డికి కూడా విన్నవించగా ఆయన మున్సిపల్ కమిషనర్‌ను పరిశీలించాలని ఆదేశించారు. సోమవారం పలువురు శ్మశాన వాటికలో కనీస వసతులు లేకపోవడం, ప్రైవేటు వ్యక్తుల అక్రమ వసూళ్లు, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపం వంటి అనేక అంశాలను ఆయన దృష్టికి తెచ్చారు.శ్రీకాళహస్తి పట్టణంలో మృతి చెందిన వారికి అంత్యక్రియలు, పూల కార్యక్రమాలు, పెద్ద కర్మలు చేసుకునేందుకు తగిన భవనాలు గానీ, కనీస వసతులు గానీ లేవని ప్రజలు వాపోయారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కూడా పూర్తిగా కొరవడిందని, దీని వల్ల శవాన్ని మోసుకెళ్లి దహనం చేసేందుకు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మోక్షం కోసం వేలాది మంది భక్తులు వచ్చే పుణ్యక్షేత్రంలో శ్మశాన వాటికలు దయనీయ స్థితిలో ఉండడం బాధాకరమని పేర్కొన్నారు. శ్మశానంలో శవ దహనానికి సాయం చేసే ప్రైవేటు వ్యక్తులు, శ్మశాన సహాయకులు పేరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఒక మృతదేహాన్ని ఇంటి నుండి శ్మశానం వరకు తీసుకెళ్లి దహనం చేసేందుకు రూ.30 వేల నుండి రూ.40 వేల వరకు బలవంతంగా వసూలు చేస్తున్నారని, అడిగినంత ఇవ్వకపోతే శవాన్ని ముట్టుకోమంటూ, దహనం చేయమంటూ బెదిరిస్తున్నారని వినతి పత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇక్కడున్న కొంతమంది వ్యక్తులు తాము ఈ స్థలాన్ని రూ. 12 లక్షల వరకు కాంట్రాక్ట్ పాడుకున్నామని ఇక్కడ తామే దహన సంస్కారాలు నిర్వహించాలని ఒక వర్గం అంటుంటే మరో వర్గం ఇక్కడ మేము కూడా వేలం పాటలో పాడుకున్నామని పూర్వాలంటే తమ అనుమతి కావాలని లేదంటే ఇటు సైడ్ తీసుకొని రావొద్దని హెచ్చరిస్తున్నట్లు ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. చివరి మజిలీ యాత్రకు పేద, మధ్య తరగతి ప్రజలు తమ ఆత్మీయులకు గౌరవప్రదంగా అంత్యక్రియలు చేయలేక, కన్నీరు మున్నీరుగా రోదిస్తూ బ్రతుకుతున్నారని తెలిపారు. పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు ప్రభుత్వ ఫీజులు, పన్నులు కడుతున్నా, చివరకు చనిపోయాక కూడా ప్రైవేటు వ్యక్తుల దోపిడీకి బలికావాల్సి వస్తోందని వాపోయారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి ప్రజలు కమిషనర్ ను పలు డిమాండ్లు కోరారు. ప్రస్తుతం జరుగుతున్న దహనంతో పాటు, హిందూ సంప్రదాయం ప్రకారం నదిలో దహనం చేసుకునేందుకు కూడా తగిన వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయించిన రుసుముల వివరాలను తెలిపే సూచిక బోర్డులను శ్మశాన వాటికలో, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని, మున్సిపల్ శాఖ ద్వారానే నేరుగా రుసుము వసూలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనల ప్రకారం మాత్రమే శ్మశానంలో కార్యక్రమాలు జరిగేలా చూడాలని, మృతుల కుటుంబాలకు గౌరవప్రదమైన వాతావరణంలో అంత్యక్రియలు జరుపుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. ఈ సమస్యపై స్పందించిన కమిషనర్ కృష్ణారెడ్డి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రవి పిళ్ళైకు ఘన స్వాగతం

రేణిగుంట, ఆగస్టు 31 ప్రభాతవార్త:



ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత, భారతీయ కోటీశ్వరుడు బి. రవి పిళ్ళై సోమవారం కుటుంబ సమేతంగా రేణిగుంట విమానాశ్ర యానికి చేరుకున్నారు. దుబాయిలో నివాసం ఉంటున్న రవి పిళ్ళై దైవదర్శనాల నిమిత్తం తన కుమారుడు గణేష్ పిళ్ళైతో కలిసి తిరుపతి పర్యటనకు వచ్చారు. ఆయన రాక సందర్భంగా రేణిగుంట విమానాశ్రయంలో పలువురు ప్రముఖులు, బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయానికి చేరుకున్న రవి పిళ్ళైను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ వల్లంశెట్టి ధర్మరాజు, ఆయన సోదరుడు పల్లంశెట్టి గోపాలకృష్ణ, బీజేపీ నాయకులు కుర్రకాలవ వేణు ముదిరాజ్, రేణిగుంట పట్టణ బీజేపీ అధ్యక్షుడు నరేష్ రాయల్, మండల ఉపాధ్యక్షుడు రాజా రాయల్, రమణ రాయల్, వేణు తదితరులు రవి పిళ్ళైకు ఆత్మీయ స్వాగతం పలికారు.

## నైమిశారణ్య ఆశ్రమంను మూసివేయాలి

తిరుపతి హెల్త్, ఆగస్టు 31 ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లా, పీలేరు తాలూకా, తలుపుల వద్ద ఉన్న నైమిశారణ్య ఆశ్రమం (మహర్షి చారిటబుల్ ట్రస్ట్) స్వామీజీ పై చట్టపరమైన చర్యలు తీసుకొని, అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఆశ్రమాన్ని మూసివేయాలని బాధితురాలు శెట్టిపల్లి శ్యామల, భర్త డివిటి ఆనంద్ సంబంధిత అధికారులను కొరారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రొంపిచర్ల, శ్రీ ముత్యాలమ్మ గుడి వీధిలో అమ్మా నాన్నలతో ఉంటున్నామని, శ్యామల అమ్మ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ ఉండేదని, తనకు పెళ్లి అయ్యి పిల్లలు పుట్టకపోవడంతో, ఉద్యోగరీత్యా బాగా ఉన్నామని గమనించి అక్కడే స్థిర నివాసం ఉన్న శ్రీనివాసులు రమణానంద పోలకల (వెంకటరమణ) ద్వారా మోహన్ రెడ్డికి, నవీన్ నాయుడుకి పరిచయం చేయడంతో వారు ఆశ్రమానికి వచ్చి పూజలు చేస్తే మీ అమ్మ ఆరోగ్యం, నీకు పిల్లలు పుడతారని మా బలహీనతను అడ్డుపెట్టుకొని ఆశ్రమ నిర్మాణానికి డబ్బులు అప్పుగా ఇవ్వాలని, మీ పైన దుష్టశక్తుల ప్రభావం ఉన్నది పూజలు చేయాలని నమ్మబలికి మా వద్ద నుంచి వారికి 800 గ్రాముల బంగారాన్ని 54,000 రూపాయలకు బలవంతంగా అమ్మించిన, పులను, ఇంట్లో దాచుకున్న 55 లక్షల రూపాయలను కూడా భయపెట్టి అప్పుగా తీసుకున్నారని ఆరోపించారు. తిరుపతిలో ఉన్న ఇల్లును కూడా స్వామీజీ రమణానంద, మోహన్ రెడ్డి ఇద్దరు కలిసి ఇల్లును అమ్మెచ్చి ఆ డబ్బును ఆశ్రమానికి ఉపయోగించుకొని నిర్మాణం పూర్తయిన అనంతరం మీ డబ్బులు తిరిగి చెల్లిస్తామని మాయమాటలు చెప్పి వారు చెప్పిన అకౌంట్స్‌కి నంబర్స్‌కి నాగదుగా 2,17,53,267 రూపాయలు జమ చేశామని, బ్యాంకు ద్వారా 1,32,23267 రూపాయలు తమ చేశామని పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చినట్టు ఎవరికైనా చెప్పితే సంతానం కలగదని భయపెట్టారని, వీరి వల్ల స్వామీజీ వల్ల మేము అప్పుల పాలు అయ్యామని అర్థం చేసుకొని,ఆ డబ్బులు తిరిగి ఇవ్వమని అడగగా ఇచ్చేది లేదు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోమని బెదిరించారని ఆరోపించారు.

## ముగిసిన మహాభారత ఉత్సవాలు



చంద్రగిరి, ఆగస్టు 31 ప్రభాతవార్త:

ద్రౌపధి అమ్మవారికి అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. చారిత్రాత్మక చంద్రగిరిలో మహాభారత ఉత్సవాలను పగటిపూట హరికథ భాగవతారిణి జి.గీతావాణి, రాత్రి నాటకములు శ్రీ వెంకటేశ్వర కళా నాట్యమండలి, మించల ప్రవీణ్‌కుమార్ చంద్రగిరి వారి బృందంచే, దాతల సహకారంతో పినపెద్ద విరూపాక్షి శంకర్ రెడ్డి వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం ధర్మరాజ పట్టాభిషేక మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రి ఆలయ అర్చకులు అమ్మవారిని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణలు గావించి తిరుచ్చిపై అధిష్టింపజేశారు. గ్రామవీధులలో ఊరేగింపు చేశారు. రాత్రి ఆలయ అర్చకులు శ్రీదౌపధి సమేత ధర్మరాజుల స్వామి వారి ఆలయంలో మహాభారత ఉత్సవాలను ధ్వజావరోహణంతో ముగింపు పలికారు. మహాభారత ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో కీలకంగా పనిచేసిన ప్రతి ఒక్కరూ అమ్మవారి ఊరేగింపులో పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియకు వేగవంతం....

### అభ్యంతరాల పరిశీలన ముమ్మరం



రేణిగుంట, ఆగస్టు 31 ప్రభాతవార్త

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్ల అభ్యంతరాలు, అభ్యర్థనల పరిశీలన ప్రక్రియ రేణిగుంటలో వేగం పుంజుకుంది. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు కొనసాగించడంతో పాటు, అనర్హమైన నమోదులను తొలగించే క్రమంలో అధికారులు క్షేత్రస్థాయిలో చేపడుతున్న పరిశీలనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రేణిగుంట ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ శ్రవణ్‌కుమార్, ఎంపీడీవో రవిచంద్ర, డిప్యూటీ తహసీల్దార్ శ్యాంప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో ప్రభురావు ఆధ్వర్యంలో నోటీసులు అందుకున్న వ్యక్తుల అభ్యర్థనలు, సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. వివిధ గ్రామాలకు చెందిన వీఆర్వోలు, బూత్ లెవల్ అధికారులు ఈ ప్రక్రియలో పాల్గొని సంబంధిత వివరాలను నమోదు చేశారు.ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి నమోదులు, ఒకే వ్యక్తి పేరుతో రెండు ప్రాంతాల్లో ఓటు నమోదైన సందర్భాలను అధికారులు గుర్తించి సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ఏ ఒక్కరి పేరు కూడా అనవసరంగా ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు.

## పూజా సామగ్రి బహుకరణ

రేణిగుంట, ఆగస్టు 31 ప్రభాతవార్త



శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని రేణిగుంట పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం వద్ద సోమవారం ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిం చారు. మండల పరిధిలోని పలు దేవాలయాలకు యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు పూల వెంకటాద్రి యాదవ్ పలువురితో కలిసి పూజా సామగ్రిని భక్తిశ్రద్ధలతో బహుకరించారు. పూల వెంకటాద్రి యాదవ్ మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడు సనాతన ధర్మాన్ని, ధర్మమార్గాన్ని లోకానికి బోధించిన మహోన్నత పురుషుడని అన్నారు. కర్మయోగం, జ్ఞానయోగం, భక్తిమార్గాల సారాన్ని మానవాళికి అందించిన జగద్గురువుగా శ్రీకృష్ణుడిని కొనియాడారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా దేవాలయాలకు పూజా సామగ్రిని సమర్పించడం ద్వారా ఆధ్యాత్మికతను, భక్తిభావాన్ని మరింత పెంపొందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెంకటాద్రి యాదవ్ తెలిపారు. భగవంతుని అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో భక్తులు, యాదవ సంఘ నాయకులు, దేవస్థాన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భూమి వ్యవహారంలో మోసం చేశారంటూ ఫిర్యాదు

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 31 ప్రభాతవార్త:



చిట్టమూరు మండలం గునుపాడు గ్రామంలో భూమి వ్యవహారంలో తనను మోసం చేశారని తడ మండలం కొందూరుకు చెందిన శివకృష్ణ ఆరోపించారు. సర్వే నంబర్ 234/డి6తీలో భూమి ఉన్నట్లు ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేసి, తన వద్ద నుంచి రూ.1.12 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుని అగ్రిమెంట్ చేసుకున్నారని తెలిపారు. అనంతరం రికార్డులు పరిశీలించగా భూమి మిగులు లేదని గుర్తించినట్లు పేర్కొన్నారు. అడ్వాన్స్ తిరిగి ఇవ్వాలని కోరినా ఇవ్వకుండా, తనకు తెలియకుండా అదే భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని అధికారులను కోరారు.



హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో మాజీ మంత్రి అంబటి రాంబాబును పరామర్శించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

*తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త*

## పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

చిన్నగొట్టిగల్లు,ఆగస్టు 31 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని శ్రీ భీమేశ్వర ఆలయంలో పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమైంది. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, వేదమంత్రోచ్చారణలతో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మహోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి పంచముఖ ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠతో ఆలయానికి మరింత ఆధ్యాత్మిక ప్రాధాన్యత చేకూరిందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 31 ప్రభాతవార్త :

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే ప్రక్రియను వేగవంతం చేసి, ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఏపీ రజక ఎస్సీ సాధన కమిటీ రాష్ట్ర కన్వీనర్ అక్కినపల్లి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద రజక సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ పిజిఆర్ఎస్ నందు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ కు వినతిపత్రం అందజేసి కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి అందజేయాలని కోరారు. లక్ష్మయ్య మాట్లాడుతూ, రజకుల చిరకాల డిమాండ్‌పై ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక అధ్యయన కమిటీ ఏర్పాటు చేసి, రాష్ట్రంలోని రజకుల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేయాలని కోరారు. దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ జాబితాలో కొనసాగుతున్నందున, ఒకే వృత్తి చేస్తున్న వారికి దేశవ్యాప్తంగా సమానమైన రిజర్వేషన్ విధానం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రజక ఎస్సీ సాధిన కమిటీ సభ్యులు శివయ్య, అశోక్ కుమార్, మునిరాజా, మల్లెల నాగరాజు, కుమారస్వామి, మురళి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక స్మశాన వాటిక కేటాయించాలి



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 31 ప్రభాతవార్త : బతికున్నప్పుడు ఎన్నో కష్టాలు.. చనిపోయిన తర్వాతైనా ప్రశాంతంగా అంత్యక్రియలు జరుపుకునే అవకాశం లేకపోతే ఎలా అంటూ వెల్లంపల్లి గ్రామానికి చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి మండలం వెల్లంపల్లి గ్రామంలో ఒకే స్మశానం ఉండటంతో ఇప్పటివరకు అందరూ అక్కడే దహన సంస్కారాలు నిర్వహించే వారని తెలిపారు. అయితే కొంతకాలంగా గిరిజనులు అక్కడ అంత్యక్రియలు నిర్వహించకూడదంటూ కొందరు అడ్డుకుంటూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దీంతో గిరిజనులకు ప్రత్యేకంగా స్మశాన స్థలాన్ని గుర్తించి కేటాయించాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తమకు గౌరవంగా అంతిమ సంస్కారాలు నిర్వహించుకునే హక్కు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

## డీకేటీ పట్టా మంజూరు చేయాలి



విజయపురం, ఆగస్టు 31 ప్రభాత వార్త: మండలంలోని కలియంబాకం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 68/2లో గల సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో మాధవరం దళితవాడకు చెందిన 22 మంది దళితులు 40 ఏళ్లుగా వ్యవసాయ పంటలు, సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని అందుకు సంబంధించి డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం మండల తహసీల్దార్ మునిశైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా సెంట్ వ్యవసాయ భూములు లేని దళితుల మని తమరు స్పందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## మహా కుంభాభిషేక మహోత్సవంలో మాజీ మంత్రి రోజా

విజయపురం, ఆగస్టు 31 ప్రభాతవార్త: మండలంలోని సామిరెడ్డికండ్రిగ గ్రామంలో శ్రీశ్రీశ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయ నూతన మహా కుంభాభిషేక మహోత్సవం ఆ గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి మాజీమంత్రి రోజా హాజరై శ్రీ సంతాన వేనుగోపాల స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించి రోజాకి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా రోజా ఆలయ నిర్వాహకులను, గ్రామపెద్దలను అభినందిస్తూ స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరంఆలయ గ్రామ పెద్దలు రోజాని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## స్పందనలో సత్యవేడు ఎమ్మెల్యే కలెక్టర్‌కి వినతి



సత్యవేడు, ఆగస్టు 31 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మరోసారి తనదైన శైలిలో ముందడుగు వేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నియోజకవర్గం లోని పలు కీలక సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి నేరుగా తీసుకెళ్లారు. ప్రజలకు సంబంధించిన సమస్యలు కేవలం వినతులకే పరిమితం కాకుండా, వాటికి వెంటనే పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రేషన్ షాపుల నుంచి క్వారీ వరకు ప్రజా సమస్యలపై ఫోకస్ పిచ్చాటూరు మండలం వేలూరు గ్రామరేషన్ షాపు నెం.1020014ను బి.నాగభూషణంకు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే నాగలాపురం మండలం టీపీ పాళెం గ్రామంలో రేషన్‌షాపు మంజూరు చేయాలని విన్నవించారు. కేవీబీపురం మండలం రంగయ్యగుంట క్వారీని రద్దు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలపై అధికారులు నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయాలని, పిచ్చాటూరు, సత్యవేడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఖాళీలను నిబందనల ప్రకారం భర్తీ చేయాలని ఎమ్మెల్యే కోరారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందాల్సిన సేవలు మరింత సమర్థవంతంగా అందేలా సిబ్బంది కొరతను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సత్యవేడు నియోజకవర్గ ప్రజల సమస్యలను జిల్లా స్థాయిలో నేరుగా ప్రస్తావిస్తూ వాటి పరిష్కారం కోసం ఎమ్మెల్యే చొరవ చూపడంపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళడమే కాకుండా, వాటి పరిష్కారం జరిగే వరకు ఫాలో అప్ చేయాలనే ఎమ్మెల్యే వైఖరి అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు.

## మీకు మేమున్నాం...విద్యార్థులకు పోలీసుల భరోసా!

రేణిగుంట, ఆగస్టు 31 ప్రభాతవార్త మహిళలు, విద్యార్థినులు వేధిం పులు, సైబర్ నేరాలకు గురైనప్పుడు భయంతో మోనం వహించకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని గాజుల మండ్యం సీఐ మంజు నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. రేణిగుంట మండలంలోని వీఆర్‌బీఆర్ కళాశాలలో తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో గాజులమండ్యం పోలీసుల ఆధ్వర్యంలో మహిళల భద్రత, రక్షణపై అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది.ఈ సందర్భంగా సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐ హరీష్ విద్యార్థినులతో మాట్లాడి మహిళల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.సామాజిక మాధ్యమాల వినియోగంలో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లు, ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని తెలిపారు. సోషల్ మీడియాలో పరిచయమైన వ్యక్తులను పూర్తిగా నమ్మకుండా జాగ్రత్త వహించాలని, అనుమానాస్పద సందేశాలు, లింకులు, కాల్స్ వస్తే స్పందించకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ వేల్పుల భాస్కర్ యాదవ్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## వైయస్సార్సీపి శ్రేణులపై అక్రమ కేసులు ఆపండి : ఉన్నం



తొట్టంబేడు, ఆగస్టు 31 ప్రభాతవార్త:

తొట్టంబేడు మండలంలోని వైయస్సార్సీపి శ్రేణులపై పోలీసులు అక్రమ బైండోవర్ కేసులు పెడుతున్నారని ఈ విధానాలకు స్వస్తి చెప్పాలని సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు డిమాండ్ చేసారు.ఈ మేరకు ఆయన వైకాపా నాయకులతో కలసి సోమవారం తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఉన్నం వాసుదేవ నాయుడు మాట్లాడుతూ తొట్టంబేడు మండలంలోని ప్రతి గ్రామంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, సానుభూతిపరుల పై కక్ష సాధింపుగా అధికార పార్టీ మెప్పు కోసం అధికారులు పని చేయటం శోచనీయం అన్నారు. ముఖ్యంగా తొట్టంబేడు, 2 టౌన్ పోలీసులు అనవసరంగా అక్రమ కేసులు పెడుతూ మండలంలోని పార్టీ క్యాడర్‌ను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, పంచాయతీ ఎలక్షన్స్ షెడ్యూల్ ప్రకటించక ముందే హడావిడి చేసి వైకాపా కార్యకర్తలను భయపెడుతున్నారని తెలిపారు. లింగమనాయుడు పల్లి పంచాయతీ కురవకనేరి గ్రామంలో శ్రీరామ మందిరం కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని యువకులు మైక్ సెట్ ఏర్పాటు చేసుకొని భజన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా యువకుల పైన, కార్యనిర్వాహకుల పైన బైండవర్ కేసులు పెడుతున్నామని, గ్రామస్తులందరినీ పోలీస్ స్టేషన్కు రమ్మని తొట్టంబేడు పోలీసులు అందరికీ ఫోన్లు చేశారని, అదేవిధంగా జ్ఞానమ్మ కండ్రిగ పంచాయతీ, జ్ఞానమ్మ కండ్రిగ గ్రామంలో 10 సంవత్సరాల లోపు ఇద్దరూ మైనర్ బాలురులు గొడవ పడుతుండగా కొత్త కండ్రిగ గ్రామ కాపరస్తుడు రమణారెడ్డి అనే వ్యక్తి నా మనవడిని కొడతావా అని జ్ఞానమ్మ కండ్రిగలోని 10 సంవత్సరాల మైనర్ బాలుడును విచక్షణారహితంగా కొట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మాజీ మండలాధ్యక్షులు కోవి చంద్రయ్య నాయుడు, తొట్టంబేడు మండల వైయస్సార్సీపి అధ్యక్షులు డాక్టర్ కోగిలి సుబ్రహ్మణ్యం, చింతా రాజేంద్ర, జె. శ్రీరాములు రెడ్డి, పి. గిరిధర్ రెడ్డి, ఎం. అల్లెయ్య, టి. మురళి మరియు మండల వైయస్ఆర్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

31CTR 6:31CTR 6.qxd 8/31/2026 11:42 PM Page 1



# సంస్కృతం భారతీయ సంస్కృతికి జీవనాడి



తిరుపతి విద్య, ఆగస్టు 31 ప్రభాతవార్త: సంస్కృత భాష భారతీయ సంస్కృతి, జీవన విధానానికి జీవనాడి వంటిదని సంస్కృతోత్సవ-2026 ముగింపు సభలో వక్తలు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో వారం రోజులుగా నిర్వహించిన సంస్కృతోత్సవ ముగింపు కార్యక్రమం సోమవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని రామేశ్వరం గ్రౌండ్ ఫ్లోర్ హాలులో ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి రామకృష్ణ మిషన్ సభ్యులు పూజ్య స్వామి సుకృతానంద మాట్లాడుతూ సంస్కృతం ప్రాచీనమైన, ఉన్నతమైన శాస్త్రీయ భాషగా గుర్తింపు పొందిందన్నారు. రుషికేశ్ కైలాస ఆశ్రమానికి చెందిన శ్రీ మేధానంద పూరి మాట్లాడుతూ భారతీయుల జీవన విధానంలోని అనేక సంస్కారాలు, ఆచారాలు సంస్కృత భాషతో ముడిపడి ఉన్నాయన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ వైదిక సమాజానికి సులభంగా అర్థమయ్యేలా చేయడమే శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ ప్రధాన లక్ష ్యమన్నారు. విద్యార్థులు కేవలం వేద మంత్రాల పఠనానికే పరిమితం కాకుండా వాటిలోని తాత్విక, శాస్త్రీయ అంశాలపై పరిశోధన చేసి సమాజానికి అందించాలని సూచించారు. వారం రోజులుగా నిర్వహించిన 13 రకాల సంస్కృత భాషా పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వేద మంత్ర అంత్యాక్షరిలో విష్ణుకుమార్ శర్మ, శ్లోక అంత్యాక్షరిలో సృజన్ శుక్లా, సంస్కృత వక్తృత్వంలో ఆకాశ్ పాండే, సంస్కృత గీత పోటీలో హిమాంశు తివారీ ప్రథమ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బలభద్ర ఉపాధ్యాయ, సమన్వయకర్త డాక్టర్ గిరిజా ప్రసాద్ షడంగి, అదనపు సమన్వయకర్త డాక్టర్ కె.వి. నరసింహ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. శాంతిమంత్ర పఠనంతో కార్యక్రమం ముగిసింది.

# తిరుపతి డివిజన్

## క్రీడా ప్రతిభలో... మూడో స్థానం

తిరుపతి విద్య, ఆగస్టు 31 ప్రభాతవార్త:



జిల్లాస్థాయి పాఠశాల క్రీడా ప్రతిభ అవార్డుల్లో మహాత్మా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల సత్తా చాటింది. పాఠశాల క్రీడా విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అందించిన 2026 స్పోర్ట్స్ అవార్డుల్లో తిరుపతి జిల్లాలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. కాళహస్తిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. పరంధామనాయుడు పాఠశాల తరఫున ధ్రువపత్రం, జ్ఞాపికను అందుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో క్రీడా విభాగం అధిపతి విజయకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు శకుంతల, హేమంత్‌లను ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు నాణ్యమైన క్రీడా శిక్షణ అందిస్తూ మరిన్ని విజయాలు సాధించేలా ప్రోత్సహించాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు. క్రీడల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించి సన్మానించారు.

## కళ్యాణ వెంకన్న బ్రాస్‌లెట్ వితరణ



చంద్రగిరి, ఆగస్టు 31 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి బెంగుళూరుకు చెందిన పరమేశ్వరి బంగారు బ్రాస్‌లెట్‌ను కానుకగా అందజేశారు. ఇందులో భాగంగా సోమవారం పరమేశ్వరి దంపతులు ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మిని ఆలయ పడికావలి వద్ద కలసి 16.260 గ్రాముల బరువైన రూ.2,82,520/-లు విలువైన బంగారు బ్రాస్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారికి స్వామివారి దర్శన సౌకర్యం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ఆనంబట్టు ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్ సంచాలకులను కలిసిన పలువురు ప్రముఖులు





తిరుపతి హెల్త్, ఆగస్టు 31 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు. జగదీష్ గారు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం నందు పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతిని మర్యాద పూర్వకంగా కలిసిన వారిలో తుడా చైర్మన్, టిటిడి పాలక మండలి ఎక్స్ అఫిషియో సభ్యులు డాలర్ దివాకర్ రెడ్డి, టీటీడీ శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ చైర్మన్ బి.శ్రీధర్ వర్మ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ తుడా చైర్మన్ జి. నరసింహ యాదవ్, రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, తిరుపతి మాజీ శాసనసభ్యులు మన్నూరు సుగుణమ్మ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళీ, కొమ్మినేని మోహన్ బాబు, లెక్కల సురేష్‌లు కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాలు సమర్పించి శాలువలతో సత్కరించారు. స్విమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డా. గుడారు జగదీష్ పేద ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి టీటీడీకి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వీరు ఆకాంక్షించారు.

## పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలకు సన్నాహాలు

తిరుపతి విద్య ఆగస్టు 31 ప్రభాతవార్త:



జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2న తిరుపతి నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు. ఉదయం 8.30 గంటలకు పూలే విగ్రహం వద్ద ర్యాలీ ప్రారంభమై 9.30 గంటలకు కచ్చపి ఆడిటోరియం వద్ద ముగుస్తుందని తెలిపారు. అనంతరం ఆడిటోరియంలో పవన్ కల్యాణ్ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షి ంచేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన యువజన విభాగాన్ని ప్రకటించే అవకాశం ఉందని ఆరణి శ్రీనివాసులు తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనసేన శ్రేణులు, పవన్ కల్యాణ్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నీలిట్‌పై వైసిపిది తప్పుడు ప్రచారం

### -తిరుపతి కేంద్రం కొనసాగుతుంది : ఆనంద్ గౌడ్

తిరుపతి,ఆగస్టు 31ప్రభాతవార్త:



నీలిట్‌పై వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ అన్నారు. తిరుపతి నీలిట్ కేంద్రాన్ని మూసివేయడం లేదని, నీలిట్ అధికారిక ప్రకటనలోనే తిరుపతి కేంద్రం కొనసాగుతుందని, అమరావతిలో రెండో నీలిట్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేసిందన్నారు. తిరుపతి కేంద్రం ఇప్పటికే 4,308 మందికి శిక్షణ అందించిందని, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, సెమీకండక్టర్లు తదితర ఆధునిక సాంకేతిక రంగాల్లో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా సుమారు 2 ఎకరాల అదనపు భూమి అందిస్తే తిరుపతి కేంద్రాన్ని మరింత విస్తరించేందుకు నీలిట్ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. తిరుపతి కేంద్రాన్ని తరలించడం కాదని, అమరావతిలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారనే వాస్తవాలు కళ్లముందు ఉన్నా తప్పుడు ప్రచారం చేయడం వైసిపి నేతల రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని రాగల ఆనంద్ గౌడ్ హితవు పలికారు.

## నో మ్యాపింగ్ నోటీసులపై విచారణకు సహకరించండి.!

చంద్రగిరి, ఆగస్టు 31 ప్రభాతవార్త:



నో మ్యాపింగ్ నోటీసులపై ఓటర్లు విచారణకు సహకరించాలని ఏఈఆర్ఓ (తహశీల్దార్) దుద్దెల అమరేశ్వరి కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె వివరాలను వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చంద్రగిరి మండలంలో గత రెండు వారాలుగా నో మ్యాపింగ్ నోటీసులపై ఓటర్ల నుండి ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. నో మ్యాపింగ్ నోటీసులు అందుకున్న ఓటర్లకు సంబంధించిన నోటీసులపై ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల ఆధారాలలో కనీసం మూడు ఆధారాలను పరిశీలించి ఓటును పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందు కోసం తగిన ఆధారాలతో మీ బూత్ లెవెల్ ఆఫీసర్లను (బిఎల్ఓలను) సంప్రదించాలని సూచించారు. చంద్రగిరి నియోజకవర్గంలో 2026 జూన్ 15 నుండి 2026 జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్ళి ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకుని ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించి ఆ వివరాలను డిజిటలైజేషన్ చేయడం జరిగిందన్నారు. అయితే ఈ జాబితాలో ఇంటి పేరుకు బదులుగా ఇన్షియల్ నమోదు చేయడం, పేరుకు చివరన ఇంటి పేరు వుండటం, నూతనంగా వివాహమైన వధువు భర్త పేరును నమోదు చేయగా, తండ్రి పేరు కలిగివుండటం వంటి వాటిని నిరూపించుకునేందుకు అవసరమైన ఆధారాలను అధికారులను కలసి అందజేయాలని సూచించారు. ప్రస్తుత దశలో గైర్హాజరైతే ఓటును కోల్పోతారని తేల్చిచెప్పారు.

## ఆధునిక గణిత, సాంకేతిక అంశాలపై అధ్యాపకులకు శిక్షణ



తిరుపతి విద్య, ఆగస్టు 31 ప్రభాతవార్త: గణితశాస్త్రం, కంప్యూటర్ ఆధారిత అధ్యయనాల్లో వస్తున్న ఆధునిక ధోరణులపై అధ్యాపకులకు అవగాహన కల్పించేందుకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఆరు రోజుల అధ్యాపక శిక్షణ కార్యక్రమం ముగిసింది. మదన మోహన మాళవీయ శిక్షక ప్రశిక్షణ కేంద్రం, గణితశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు రోజులపాటు గణితశాస్త్రంలో వస్తున్న నూతన ధోరణులు, పరిశోధనా అంశాలు, కంప్యూటర్ ఆధారిత అధ్యయన పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యాపకులకు నిపుణులు అవగాహన కల్పించారు. వివిధ అంశాలపై జరిగిన ఉపన్యాసాలు, చర్చలు అధ్యాపకులకు బోధన, పరిశోధనలో ఉపయోగపడే విధంగా సాగాయి. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 46 మంది అధ్యాపకులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. సమాపన కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఏ. చందూలాల్, శిక్షక ప్రశిక్షణ కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ ఎస్. మురళీధరరావు, అదనపు సంచాలకులు డాక్టర్ ఏ. చారుకేశ్, అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ రాజనీకాంత్ శుక్లా, ముఖ్య అతిథి ప్రొఫెసర్ రాకేష్ మణిలాల్ పటేల్ (గుజరాత్), డాక్టర్ కె. శంకర్, వనరుల వ్యక్తులు, పాల్గొన్న అధ్యాపకులు పాల్గొన్నారు. శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానాన్ని బోధన, పరిశోధనలో వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు.



కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన అధ్యాపకులను అభినందించారు.

## డయల్ యువర్ సిఎండికి...74 వినతులు



తిరుపతి,ఆగస్టు 31ప్రభాతవార్త: విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకోవడానికి నిర్వహిస్తున్న డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 74 వినతులు అందాయి. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమం జరిగింది. వినియోగదారుల నుండి సమస్యలను ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపారు.

## ఆర్‌టిసి బస్సు ఢీకొని ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

చంద్రగిరి, ఆగస్టు 31 ప్రభాతవార్త:



ఆర్‌టిసి బస్సు ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాల పాలైన దుర్ఘటన సోమవారం ఉదయం చంద్రగిరి బైపాస్ వద్ద చోటుచేసుకున్నది. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి చంద్రగిరి నుండి సర్వీస్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతున్న పచ్చిపాల చరణ్‌కుమార్ (20), తోట కిరణ్‌కుమార్ (19)లను ఎదురుగా హైవే నుండి సర్వీస్ రోడ్డులోకి ప్రవేశిస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్ర గాయాలపాలవగా చరణ్‌కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మెరుగైన వైద్యం కోసం కిరణ్‌కుమార్‌ను అమర హాస్పిటల్‌కు తరలించారు. చరణ్‌కుమార్ అన్నమయ్య జిల్లా, సదుం మండలం, చీకలచేను గ్రామానికి చెందిన యువకుడు కాగా, కిరణ్‌కుమార్ చిత్తూరు జిల్లా, పూతలపట్టు మండలం, అయ్యప్పగారిపల్లి పంచాయతీ, తోటపల్లికి చెందిన వారుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**-భాకరాపేట ఘాట్‌రోడ్డుపై లారీ దగ్ధం**చంద్రగిరి మండల పరిధిలోని భాకరాపేట ఘాట్ రోడ్డుపై మహారాష్ట్రలోని బరంపూర్ నుండి వస్తున్న పైపుల లారీ సోమవారం ఉదయం మంటల్లో చిక్కుకుని దగ్ధమయ్యింది. ప్రమాదాన్ని గమనించి అప్రమత్తమయిన డ్రైవర్ క్రిందకు దూకి ప్రాణాలను కాపాడుకున్నాడు. ఈ ప్రమాదంలో డీజిల్ ట్యాంకు పేలుడు కారణంగా పైపులతో సహా లారీ మంటల్లో కాలిపోయినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బీటెక్ విద్యార్థులకు తొలి అడుగులోనే దిశానిర్దేశం

తిరుపతి విద్య, ఆగస్టు 31 ప్రభాతవార్త: ఇంజినీరింగ్ విద్యలో తొలి అడుగు వేసిన విద్యార్థులకు యస్వీయూలో దిశానిర్దేశం చేశారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం సోమవారం ఓరియంటేషన్, ఇండక్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీనివాస ఆడిటోరియంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. శ్రీని వాసులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విశ్వవిద్యాలయం, ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలు, సౌకర్యాలు, ప్రత్యేకతలను వివరించారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 11 వరకు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు కళాశాల విద్యా విధానం, విభాగాలు, వసతులపై పూర్తి అవగాహన పొందేలా కార్యక్రమాలను రూపొందించారు. విద్యతోపాటు పరిశోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఆచార్య ఎస్. నారాయణరెడ్డి సూచించారు. డీన్ ప్రొఫెసర్ కె. మల్లికార్జునరావు ఆర్-25 నిబంధనలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్.డి.వి. సుబ్బారావు బాలుర వసతిగృహ సౌకర్యాలపై వివరించారు. మహిళా వసతిగృహ వార్డెన్ ఆచార్య టి. రమశ్రీ నియమ నిబంధనలను వివరించగా, సహాయ రిజిస్ట్రార్ గోపాల్ పరీక్షలకు అవసరమైన కనీస హాజరు శాతంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సివిల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. మునిలక్ష్మి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు.

## హోటళ్ళ నిర్వాహకులతో అదనపు ఈఓ సమావేశం

తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి హోటళ్ళ నిర్వాహకులతో సమావేశంనిర్వహించారు. భక్తుల ఆహార భద్రతే మనందరి ప్రధమ బాధ్యత అన్నారు.

## పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయండి.!



రామచంద్రాపురం, ఆగస్టు 31 ప్రభాతవార్త: పంచాయతీలో నివశించే నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సి.రామాపురం మాజీ సర్పంచ్ సుబ్బరామయ్య అన్నారు. సోమవారం రామచంద్రాపురం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సి.రామాపురం లెక్కదాఖలా సర్వే నంబర్ 110లో 11.18 ఎకరాలు ప్రభుత్వ భూమి వుందన్నారు. ప్రభుత్వ భూమిని తిరుపతికి చెందిన గిరిధర్ రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడని వాపోయారు. పేదలు ఇంటి స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే తిరుపతి నుండి వచ్చి మా గ్రామం ప్రక్కన వున్న ప్రభుత్వభూమిని ఆక్రమించుకోవడమేంటని ప్రశ్నించారు. స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి, నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కాలనీకి చెందిన గంగాధరం, హరి, గోపి, నాగభూషణం, వనమ్మ, రోజా, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం పోలీసుల అదుపులో నిందితులు

పుల్లంపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త : పుల్లంపేట మండల పరిధిలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న మారుతి ఎర్టిగా వాహనంలో సోమవారం పుల్లంపేట పోలీసులు తనిఖీలు నిర్వహించి గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది, కడప నుండి తిరుపతి వెళుతున్న వాహనం అనుమానస్పదంగా రావడంతో తనిఖీ చేయగా అందులో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు సమాచారం ప్రకాశం జిల్లా చీరాల నుంచి తరలిస్తున్నట్లు సమాచారం నలుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తుంది ఈ విషయమై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## క్యాన్సర్ రోగులకు నిపుణుల వైద్య సేవలు

### - స్విమ్స్ సంచాలకులు ఉపకులపతి డా. గుడారు జగదీష్

తిరుపతి హెల్త్, ఆగస్టు 31 ప్రభాతవార్త:



తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న శ్రీవారి వైద్యసేవ కార్యక్రమంలో భాగంగా, శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్), తిరుపతి రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డా. కిరణ్ కుమార్ విజిటింగ్ ఫ్యాకల్టీగా ప్రత్యేక వైద్య సేవలు అందించ నున్నట్లు స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ హాస్పిటల్ రేడియేషన్ ఆంకాలజీ విభాగం ప్రొఫెసర్, విభాగాధిపతిగా సేవలందిస్తున్న డా. కిరణ్ కుమార్, 31.08.2026 నుండి 02.09.2026 వరకు స్విమ్స్‌లో అందుబాటులో ఉండి క్యాన్సర్ రోగులకు ఉచితంగా నిపుణుల వైద్య సేవలు, చికిత్సాపరమైన సలహాలు అందించనున్నారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. గుడారు జగదీష్ మాట్లాడుతూ రేడియేషన్ ఆంకాలజీ రంగంలో 26 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన డా. కిరణ్ కుమార్ వంటి ప్రముఖ వైద్య నిపుణులు శ్రీవారి వైద్యసేవలో భాగంగా స్విమ్స్‌కు విజిటింగ్ ఫ్యాకల్టీగా రావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులను శ్రీవారి వైద్యసేవ ద్వారా స్విమ్స్‌కు ఆహ్వానించి, వారి విశేష నైపుణ్యం, అనుభవాన్ని రోగుల చికిత్సతో పాటు వైద్య విద్య, శిక్షణకు వినియోగించడం ద్వారా స్విమ్స్‌లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు డా. గుడారు జగదీష్ తెలిపారు.

## రిజిస్ట్రార్‌ను తక్షణమే వెనక్కి పిలిపించాలి: సీఐటీయూ

తిరుపతి విద్య, ఆగస్టు 31 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలో ఆర్థిక, పరిపాలనా వ్యవహారాలకు సంబంధించి ఆడిట్‌లో అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ తగిన చర్యలు తీసుకోకపోవడంపై సీఐటీయూ ప్రశ్నించింది. విశ్వవిద్యాలయంలో వెలుగులోకి వచ్చినట్లు పేర్కొంటున్న అవినీతి, అక్రమాలు, నకిలీ ధ్రువపత్రాలు, అక్రమ పదోన్నతులు, నిధుల మళ్లింపు ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ తిరుపతి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. విశ్వవిద్యాలయంలో ఆర్థిక, పరిపాలనా వ్యవహారాలపై ఏజీ ఆడిట్‌లో పలు అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. కొన్ని ఆర్థిక లావాదేవీలకు సంబంధించి న్యాయస్థానాల్లో




కేసులు, తీర్పులు ఉన్నప్పటికీ విశ్వవిద్యాలయ యాజమాన్యం, సంబంధిత బాధ్యులపై తగిన చర్యలు తీసుకోకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఏవో వేము రాజేశ్వర్‌రెడ్డి సమర్పించిన డిగ్రీ ధ్రువపత్రంపై ఆడిట్‌లో వ్యక్తమైన అభ్యంతరాలు, బాల కార్తిక నారాయణరావు ధ్రువపత్రానికి సంబంధించిన అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. జి. చంద్రశేఖర్, డి. కిరణ్‌ల కారుణ్య నియామకాలకు సంబంధించిన రికార్డులపై వచ్చిన ఆరోపణలను కూడా పరిశీలించాలని డిమాండ్ చేశారు. మాజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్. రామ్మోహన్‌రావు హయాంలో ప్రైవేట్ ఖాతాలకు నిధులు మళ్లించారనే ఆరోపణలు, వై. శేషుబాబు, ఎల్. కృష్ణకుమార్‌లకు ఒకే పనికి రెండుసార్లు చెల్లింపులు జరిగాయనే ఆరోపణలు, డమ్మీ ఏజెన్సీల ద్వారా నిధుల మళ్లింపు జరిగిందనే ఆరోపణలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని సీఐటీయూ కోరింది. సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తిరుపతి జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఎస్. జయచంద్ర, ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం హెచ్చరించారు.